క్లుప్తంగా

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మక్తల్: నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ మేకు.. ఆయన మాట్లాడుతూ.. గత రెండురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న కురుస్తున్న వర్షాలకు తెలంగాణ రాష్ట్రానికి ఎగువ ఉన్న కర్ణాటక రాష్ట్రంతో పాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణానదికి భారీగా వరద వస్తుండటంతో నియోజకవర్గ కృష్ణా, మాగనూర్, నర్వ, మక్తల్ పరిధిలోని ఉన్న ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అత్యవసరసమయంలో 100కి ఫోన్ చేయాలని కోరారు. నదిలో సెల్ఫీలు, ఫొటోలు దిగొద్దని, తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపొద్దన్నారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

కృతజ్ఞత సభకు రావాలని వినతి



మరికల్: మహబూబ్‌నగర్ జిల్లాలో పీఆర్టీయూటీజీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఏర్పాటు చేసే కృతజ్ఞత సభకు రావాలని ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరికి జిల్లా అధ్యక్షుడు మహేష్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు మహేష్ వినతిపత్రాలను అందజేశారు. పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నా బదిలీలు, పదోన్నతి కల్పిస్తూ విద్యాభివృద్ధికోసం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞత చెప్పేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చిన జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీజీ నాయకులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ లభ్యం

ఊట్కూరు: మండలంలోని మొహర్రం వేడుకల్లో బుధవారం అదృశ్యమైన ముగ్దంపూర్ గ్రామానికి చెందిన భాను అనే బాలిక ఆచూకీ లభ్యమైనట్లు శుక్రవారం ఇన్‌చార్జి ఎస్‌ఐ నవీద్ తెలిపారు. రెండేళ్లుగా బాలిక తల్లి అంజమ్మ భర్త రామ్మూర్తితో గొడవపడి హైదరాబాద్‌లో ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం మొహర్రం వేడుకల్లో కుటుంబ సభ్యులు పాల్గొనగా బాలికను తల్లి అంజమ్మ గుట్టు చప్పుడు కాకుండా తనతోపాటు తీసుకెళ్లింది. తల్లి అంజమ్మపై అనుమానం రావడంతో ఆమె సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసు బృందాలు హైదరాబాద్‌కు వెళ్లి బాలికతోపాటు తల్లిని కూడా తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

రుణ మాఫీతో రైతులకు విముక్తి



మరికల్: ప్రభుత్వం చేసిన రుణమాఫీతో రైతులకు విముక్తి కలిగిందని ఎంపీటీసీ గోపాల్, జిల్లా నాయకులు సూర్యమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపట్నంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పిన మాట ప్రకారమే రైతులకు న్యాయం చేశారన్నారు. రాబోయే రోజుల్లో రైతుల కోసం తమ ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యానారాయణ, రాములు, శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు..



మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ సమీపంలో అడవిసత్యారం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. మందిపల్లి రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ వర్షానికి గుంతలో నీరు నిలుస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు గుంతలో పడి బట్టలు, పుస్తకాలు పాడైపోతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

బురదమయంగా..

కృష్ణా: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. మండలానికి వచ్చే ప్రయాణికులకు బురద నీటిలో తమ వాహనాలు వెళ్లాల్సి వస్తుందని, వాహనాలు దెబ్బతింటున్నాయని అంటున్నారు. అధికారులు చొరవ తీసుకుని తాత్కాలిక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చివరి ఆయకట్టుకు నీరేది ?

- మరమ్మతుకు నోచుకోని కాల్వలు, తూములు
- అధ్వానంగా పిల్ల కాల్వలు
- నిలిచిన జూరాల నీటి పంపింగ్
- కోయిల్‌సాగర్‌లో 18.5 అడుగులకు చేరిన నీరు



మరమ్మతుకు నోచుకోని కుడి కాల్వ తూము

మరికల్: కోయిల్‌సాగర్ కాల్వలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రతి ఏడాది చివరి ఆయకట్టుకు నీరు అందక ప్రశ్నార్థకంగా మారుతుంది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఆయకట్టు పరిధిలోని కాల్వలు, తూములు మరమ్మతులపై జల వనరుల శాఖ దృష్టి సారించడం లేదు. దీంతో ప్రాజెక్టుల కింద వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారు. జూరాల ఎగువన గత ఐదేళ్లుగా భారీ వర్షాలు పడుతుండటంతో ఎగువ నుంచి కృష్ణానది పోటెత్తుండటంతో జూరాల ప్రాజెక్టు ద్వారా కోయిల్‌సాగర్‌ను నింపుతున్నారు. కోయిల్‌సాగర్‌కు 26 అడుగులు నీరు రాగానే కుడి, ఎడమ కాల్వలకు సాగు నిమిత్తం నీటి విడుదల జరుగుతుంది. కానీ కాల్వల ద్వారా ఆయ కట్టుకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. అలాగే కోయిల్‌సాగర్ పరిధిలో ప్రస్తుతం 50, 250 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ కాల్వల లైనింగ్ లేకపోవడంతో నీటి ప్రవాహం నెమ్మదిస్తోంది. దీనికి తోడు పలుచోట్ల తూములు పాడయ్యాయి. వీటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు లేకపోవడంతో ఏటా ఆయకట్టుకు సాగునీరు రాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వేసవిలో కాల్వలు, తూములు మరమ్మతులను ఇరిగేషన్ శాఖ చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఊసేలేని అదనపు ఆయకట్టు..

కోయిల్‌సాగర్ ఆయ కట్టు పరిధిలో పాత ఆయ కట్టు 12 వేల ఎకరాలు ఉండగా జూరాల నుంచి కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పనులు పూర్తిచేసిన తర్వాత అదనంగా కొత్త ఆయకట్టు 38, 250 ఎకరాలను చేర్చారు. ప్రస్తుతం ఉన్నా పరస్థితుల్లో పాత ఆయకట్టుకు కూడా పూర్తి స్థాయిల్లో నీరు అందడం లేదు. కనీసం ఉన్న ఆయకట్టు పరిధిలోనైనా కాల్వల్లో ఉన్న పిచ్చిమొక్కలు జమ్ము తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చిన్నచింతకుంట వరకు..

కోయిల్‌సాగర్ కుడి కాల్వ కింద ధన్వాడ నుంచి సాగునీరు రావడం ప్రారంభమవుతుంది. ప్రాజెక్టు నుంచి వస్తున్న ప్రధాన కుడి కాల్వ ముళ్లచెట్లతో నిండి ఉండటం, శిథిలావస్థకు చేరిన తూములు ఉండటంతో మధ్యలోనే నీరు వృథాగా పోతుంది. దీంతో తడిచిన పొలమే మళ్లి తడుస్తుండటమే కాకుండా మన్నెవాగులో చేరి దిగువకు వృథాగా పోతుంది. దీంతో చివరి ఆయకట్టు చిన్నచింతకుంట మండలానికి నీరు అందకపోవడంతో ప్రతి ఏడాది అక్కడి రైతులు కోయిల్‌సాగర్ నీటి కోసం రాత్రి, పగలు తేడా లేకుండా కాల్వలపై, తూముల వద్ద కాపల ఉండి నీళ్లు తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి.

పంటను కాపాడుకునేందుకు..



ప్రధాన కుడి కాల్వ రివ్విటింగ్, ముళ్ల పొదలు, తూములు మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టుకు నీళ్లు రావడం లేదు. పై భాగంలో ఉన్నా రైతులు తరచుగా తూములు తెరిచి ఉంచటంతో ప్రతి ఏడాది వారి పొలాలకే నీళ్లు పోతున్నాయి. పంటను కాపాడుకునేందుకు తెరిచిన తూములను మూస్తు నిద్రహారాలు విడిచ్చి పంటల సాగుకు నీళ్లు తీసుకెళ్తున్నాం.

– మల్లేష్, రైతు పెద్దచింతకుంట

తూములు మరమ్మతు చేయాలి



కేఎస్పీ ఆయకట్టు పరిధిలో ఉన్న ప్ర. దాన కాల్వలతోపాటు తూములను మరమ్మతులు చేస్తే చివరి ఆయకట్టుకు నీరందుతుంది. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించకపోవడంతో వానాకాలం, యాసంగి పంటలు చేతికొచ్చిన సమయంలో నీళ్లకోసం తాము పడే బాధలు ఎవరికి చెప్పుకోలేక పోతున్నాం. కొత్త ప్రభుత్వమైన స్పందించి మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి.

– హన్మంతు, రైతు, పల్లెగడ్డ

నిధులు మంజూరు కావాలి..

కేఎస్పీ కుడి, ఎడమ కాల్వలతో పాటు ఇతర చిన్న కాల్వలు, తూములు మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడుతాం.

– కిరణ్‌కుమార్, డీఈ, కోయిల్‌సాగర్

పోచమ్మ గ్రామ దేవతకు బోనాలు



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షణ చేస్తున్న మహిళలు

కోస్గి: పట్టణ శివారులోని పోచమ్మ గ్రామ దేవతకు శుక్రవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు బోనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు, యువతులు అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. అమ్మవారికి కోడి పుంజులను బలి ఇచ్చి తమ కోర్కెలు తీర్చాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజా ప్రతినిధులు, పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు కాపాడాలని వినతి



కోస్గి: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ భూములను ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకుంటుందని, ఆలయ భూములను కాపాడాలని పలు హిందూ సంస్థల నాయకులు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కోస్గి పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి సమగ్ర వివరాలతో వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనుల పేరుతో ఆలయ భూములు స్వాధీనం చేసుకోకుండా కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పలు సంస్థల నాయకులు బద్రీనాథ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, అంబదాస్, సంపల్లి శ్రీనివాస్, భాస్కర్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఫేక్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ కురుమయ్య

నర్వ: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీని అదునుగా చేసుకోని సైబర్ నేరస్తులు బ్యాంకుల లోగోలతో వాట్సాప్ చేస్తూ వివరాలు అడుగుతారని వీరిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు లోగో బ్లూ కలర్‌లో కొన్ని మోసపూరితమైన లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నారని, వీరిపై ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ లింక్‌లను టచ్‌చేసిన, లేక డౌన్‌లోడ్ చేసుకున్న వాట్సాప్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్తుందన్నారు. గుర్తు తెలియని బ్లూలింక్‌లను లేదా ఏపీకే ఫైల్ కానీ డౌన్‌లోడ్ చేసుకుంటే సైబర్ నేరస్తులు మీ గూగుల్, ఫోన్‌పే యూపీఐ ఐడీల ద్వారా మీకు తెలియకుండానే డబ్బులు దోచేసే ప్రమాదం ఉందన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలన్నారు.

మరికల్: ప్రభుత్వం రుణమాఫీ చేసిన చేయడంతో రైతులను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు ప్రయత్నం చేస్తుంటారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ మురళి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ. లక్ష వరకు ఉన్నా రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడంతో రైతులను బుట్టలో వేసుకునేందుకు సైబర్ నేరాగాళ్లు ఫోన్ చేస్తూ ఓటీపీ చెప్పాలని పలు రకాలుగా మోసాలకు పాల్పడుతుంటారని, అలాంటి వారి ఉచ్చులో పడొద్దని సూచించారు. ఎవరైనా అనుమానితులు ఫోన్‌చేస్తే తమకు సమాచారమివ్వాలని తెలిపారు.

దాతలకు సన్మానం



మరికల్: పట్టణంలోని అన్నిహంగులతో సరస్వతీ ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకు గాను కొందరు పెద్దలు ఓ కమిటీగా ఏర్పడి సొంతంగా డబ్బులు పొగుచేసుకొని ఆలయ నిర్మాణపనులు ప్రారంభించారు. ఆలయం నిర్మించడంలో ప్రావీణ్యం కలిగిన తమిళనాడుకు చెందిన శిల్పిలతో చక్కటి రూపం వచ్చేలా అమ్మవారి దేవతామూర్తుల శిల్పాలు, ముఖద్వారం హంసలు, ఎనుగులు తదితర శిల్పాలను చక్కగా చెక్కారు. రోజు, రోజుకు ముస్తాబు అవుతున్న ఆలయాన్ని పట్టణవాసులనే కాకుండా ఇతరగ్రామాల ప్రజలను కూడా ఆకట్టుకుంటుంది. మిగిలిన పనులకు దాతలు మరింత సహకరిస్తే రెండునెలల వ్యవధిలోనే ఆలయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కొందరు విరాళాలు అందిస్తున్న దాతలను ఆలయ కమిటీ వారిని అభినందించి సత్కరించారు.

రామకృష్ణాపురంలో జారతేఫాతెహా

కొత్తకోట రూరల్: మండలంలోని రామకృష్ణాపురంలో మొహర్రం ముగింపు మూడో రోజు సందర్భంగా జారతులు నిర్వహించారు. 10రోజుల పాటు భక్తిశ్రద్ధలతో మొహర్రంను జరుపుకొన్నామని, మూడో రోజున అలయ్ వద్ద పూలు, బుక్క, మాలిదతో గ్రామస్తులు జారతులను నిర్వహించడం అనవాయితీగా వస్తుందని పలువు పేర్కొన్నారు.

వంతెనలు లేక అవస్థలు



శేర్నపల్లి దారిలో గుంతలు పడి ప్రమాదకరంగా మారిన వంతెన



అభంగాపూర్ వంతెనపై నుంచి పారుతున్న నీరు (ఫైల్)

నారాయణపేట రూరల్ : గ్రామాలను ఆనుకుని ప్రవహిస్తున్న వాగులు చూసేందుకు అహ్లాదకరంగా ఉన్నా వర్షాకాలంలో ప్రయాణానికి పడుతున్న బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా మండలంలోని ప్రతి ఏటా వానా కాలంలో రెండు చోట్ల వాగులు వివిధ గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల నుంచి ప్రధాన రహదారికి రావాలంటే ఆపసోపాలు పడాల్సి వస్తుంది.

● ముఖ్యంగా శేర్లపల్లికి వెళ్లాలంటే జాజాపూర్ దాటిన తర్వాత వాగు దాటి వెళ్లాలి. అక్కడ లో లేవల్ కల్వర్టు నిర్మించడంతో ఎరతెరిపి లేకుండా వర్షాలు పడితే వంతెనపై భాగం నుంచి నీళ్లు పారుతుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయి. అత్యవసర సేవలకు సైతం ఆటంకం తప్పడంలేదు. దీనికితోడు కల్వర్టు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో కొద్ది పాటి నీటి ప్రవాహంలో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు, ఆటోలు ప్రమాదాలకు గురైన సంఘటనలు లేకపోలేదు.

● అదేవిధంగా అభంగాపూర్ రెండు భాగాలుగా ఉంటుంది. రెంటికి మధ్యలో నుంచి వెళ్తున్న వాగు పరిస్థితి సైతం అదేవిధంగా ఉంటుంది. భారీ వర్షాలకు నీరు వంతెన పైనుంచి వెళ్తుండటంతో అటు బండగొండ, భూనేడ్‌కు, ఇటు కోటకొండ, నారాయణపేటకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో చాలాసార్లు వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నా పాలకులు, అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. వెంటనే ఆయా వాగులపై వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

‘రైతులను మోసం చేసినందుకా సంబరాలు?’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కృష్ణా: రాష్ట్రంలో కాంగ్రెస్ సంబరాలను నిర్వహించుకోవడం ఎందుకు రైతులను మోసం చేసినందుకా అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ రైతులకు పంటలకు ఇచ్చే రైతుబంధు రూ.10 వేల నుంచి రూ.15 వేలు పెంచుతామని ఉన్నది కూడా ఇవ్వకుండా ఉన్నందుకు కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహిస్తున్నారా? అని నిలదీశారు. అలాగే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణ మాఫీ చేస్తానని, కేవలం రూ.లక్ష మాఫీ చేసిందన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలులో ఇస్తానన్నా బోనస్‌ను సైతం ఎగ్గొట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకుడు సురేష్, నాయకులు నర్సప్ప, రాఘవేంద్ర, నారాయణభట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

దామరగిద్ద: ప్రజా సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం కొనసాగుతుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు దశల వారీగా గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకుడదనే కల్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాములు, విండో అధ్యక్షుడు ఈదప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీడీఓ శశిధర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని బహార్‌పేట్ తిరుమలగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆమెతోపాటు స్థానిక కౌన్సిలర్ దొడ్డి వరలక్ష్మి, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

అలాగే పట్టణంలోని తఖీబాబా దర్గా వద్ద ఉన్న ముస్లిం శ్మశాన వాటికకు 20 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే శ్మశాన వాటికలో విద్యుత్ స్తంభాలకు లైట్లు అమర్చాలని మున్సిపల్ కమిషనర్ సునీతకు వినతిపత్రం అందజేశారు. వినతి అందించిన వారిలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు మహిమూద్ ఖురేషి, కాంగ్రెస్ పటణ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎండీ సలీం, యూసఫ్ తాజ్, అజీం, మైనొద్దీన్, సాధాతుల్లా, తాజుద్దీన్, ఉన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల రావు మళ్లీ మన జిల్లాకు రానివ్వొదంటూ శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ బృందం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన ఆయన వివిధ అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారని, మళ్లీ జిల్లాకు వచ్చేందుకు శాఖ పరంగా రాష్ట్రస్థాయిలోనే పైరవీ చేస్తున్నారని సమాచారం తెల్సిందన్నారు. ఆయన రావడంతో జిల్లాకి చెడ్డ పేరు వస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరహరి, మహేష్ ఎమ్మెల్యేకు వివరించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు తదితరులు

మద్దూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బదిలీ, పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులకు, పాఠశాలకు ఇతర పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ మేరకు.. హెచ్‌ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులతో పాఠశాలకు జిల్లా స్థాయిలో పేరు వచ్చిందని, ప్రస్తుతం ఇక్కడి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల సహకారంతో మరింత పేరు తీసుకొచ్చేవిధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సత్యారెడ్డి, సక్సెనా, వెంకటప్ప, నర్సింహారెడ్డి, శ్రీను, ఆనందం, ఆశప్ప, వేణుగోపాల్, నర్సప్ప, రఘు, బాలాజీ, సవిత, సూర్యప్రకాష్, శారధ పాల్గొన్నారు.

ఔషధ మొక్కలు నాటిన విద్యార్థులు



ఔషద మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కోస్గి: మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఔషధ మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో ఔషద మొక్కల పెంపకానికి ప్రత్యేకంగా ఎంపిక చేసిన స్థలంలో 20రకాల ఔషద మొక్కలు నాటారు. సీజీఆర్ సంస్థ సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు ఔషద మొక్కల ఆవశ్యకతను వివరిస్తూ, ఆరోగ్య పరిరక్షణలో పనిచేసే విధానంపై అవగాహన కల్పించి మెడిసినల్ గార్డెన్ ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎం శేఖరయ్య తెలిపారు. ఈ గార్డెన్‌ను విద్యార్థులు నిత్యం పర్యవేక్షిస్తూ మొక్కల పెరుగుదలకు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి, ఉపేందర్, బాలకృష్ణ, శ్రీదేవి, శంకుతల, రాజశేఖర్‌తోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు



సూచిక బోర్డుకేర్పాటు చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ లక్ష్మప్ప

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా మున్సిపాలిటీ ఆద్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని ప్రత్యేక అధికారి, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్లలో కేటాయించిన పది శాతం వాటా భూములను పరిశీలించి, వాటిలో సూచిక బోర్డులను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి మున్సిపాలిటీగా మారిన తర్వాత ఎన్ని వెంచర్లు ఏర్పాటు చేశారు.. వాటిలో ఎన్ని డీటీసీపీ లేఅవుట్‌గా ఉన్నాయన్నా వివరాలను సేకరించి వాటిలో మున్సిపల్‌కు దక్కాల్సిన పది శాతం భూమిని తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీంకు సూచించారు. వర్షాకాలంలో వర్షపు నీటితో పాటు మురుగు నిల్వ ఉండకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితం అవుతందన్న ఆరోపణల మేరకు మిషన్ భగీరథ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. వారం రోజుల వ్యవధిలో నీటి సరఫరాలో మార్పు రాకుంటే విషయాన్ని కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. పట్టణంలోని ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతకు తోడ్పాటు అందించాలని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, ఆర్‌ఐ కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి గిల్లిరాములు (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణ సాయం కింద రూ.10వేలు పంపించాడు. కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, రవి, బుచ్చన్న, రామాంజనేయులు, వెంకటస్వామి, కుర్మన్న, ఊషన్న, సాయిబాబ ఉన్నారు.